# హస్తాక్షరం

- ఎలక్ష్వాన

**ఏ ఘటనా తనంతట తానుగా సంభవించదు. ఈ 'ఘటన' అనేది ఎవరికి సంబంధించి ఎప్పుడు, ఎక్కడ, ఎలా, ఎందుకు జరిగిందీ అన్న ఆరా తీయాలంటే కార్యాకరణ సంబంధమనే 'గొలుసు'ని పట్టుకుంటూ పోయి తీరాల్సిందే. ఈ గొలుసు ప్రక్రియలో ఎవర్నీ నిందించి ప్రయోజనం లేదు.**

**నున్నటి గుండ్రాయిలా ఉన్న బొజ్జమీద బొడ్డుకిందికి దిగజారిన పంచెకట్టులో శివాలయం మండపంలో కునికిపాట్లు తీస్తున్న సిద్ధాంతి "ఏమయ్యా! ఈమధ్య కనబడ్డమే మానేశావు?" అన్న మాటలు విని ఉలిక్కిపడి లేచాడు. ఎదురుగా ఎనభై ఏళ్ల సీతారావమ్మ నిలుచుని ఉంది.**

సిద్ధాంతి కంగారుగా కిందకి దిగి నిల్చుని "ఇళ్ళల్లో పూజలూ, వ్రతాలూ కొండెక్కిపోతున్నాయి. ఎవరింటికి వెళ్లినా ఓ చిన్నచూపు చూసి పంపించేస్తున్నారు. కాస్త చనువున్న మీలాంటివారి ఇళ్ళల్లో ఓ కప్పు కాఫీ అడిగి తీసుకోవడమే తప్ప తమంతతాముగా ఓ గ్లాసుడు మజ్జిగ నీళ్ళు కూడా ఇవ్వట్లేదు. ఉదయం పూట రామాలయం దగ్గరా, సాయంత్రం పూట శివాలయం దగ్గరా మఠం వేస్తున్నాను. కాకితో కబురు పంపితే వచ్చేవాణ్ణిగా!" అన్నాడు.

"నీ విసుర్లకేం కానీ సిద్ధాంతీ! మా ఆఖరి మనవడి వరస చూస్తే నాకు నచ్చడం లేదు. ఉద్యోగంలో చేరి అయిదేళ్లయినా పెళ్లంటే ఉలకడు, పలకడు. ప్రేమవ్యవహారమా అంటే కాదంటున్నాడు. వాడి మెడకో గుదిబండని తగిలిస్తేనే కానీ నాకు నిద్రపట్టదు. నీ ఎరికలో సంబంధమేదైనా ఉంటే చూడు. రంగెలా ఉన్నా ఫర్వాలేదు కానీ కన్నువంకరా, కాలు వంకరా లేకుండా కాస్త ఒడ్డు, పొడుగూ ఉంటే వాణ్ణి ఒప్పించడం సులువు" అంది సీతారావమ్మ.

"లేకేం? పెరుగు పెంచలయ్యగారి పెద్ద మనవరాలుంది. ఒడ్డూ, పొడుగే కాదు రంగుకూడా తెలుపే. ఎటొచ్చీ ఆశ్లేష నక్షత్రం. అత్తగారికి గండం అంటారు కదా!

మీ మనవడికి పిల్ల నచ్చినా మీ కోడలు ఒప్పుకోదు. తెలిసీ ఈ సంబంధం చెబితే మీ కోడలు నన్ను నరికి పోగులుపెడుతుంది. ప్రతి ఏటా మీ ఇంట నా ద్వారా మీ పతిదేవులకీ, వారి పితృదేవతలకీ వెళ్ళే నేతిగారెలు మరొకరి ద్వారా వెళ్లేటట్లు చేస్తారు"

"వెర్రి సిద్ధాంతీ ఇంకా ఏ కాలంలో ఉన్నావయ్యా? అమ్మాయిలూ అటుపైన ఇచ్చే కట్నాలూ నచ్చాలే కానీ నక్షత్రాలూ, జాతకాలూ వాటంతట అవే కుదిరిపోతాయి. మా మనవడి జన్మ వివరాలన్నీ నీ దగ్గర ఉన్నవేగా? 'పిల్లది ఆశ్లేష అని చెప్పకుండా మావాడికి తగ్గ నక్షత్రం, జాతకం అవీ కట్టించి తీసుకురా!"

'అమ్మ ముసిల్దానా, నీదెంత లౌక్యమే?!' అని లోపల అనుకుని "మీకభ్యంతరం లేకపోతే నాకేం? దోష పరిహారార్ధం ఓ చిన్న పూజ చేయిస్తే సరిపోతుంది.

అలాగే ఆ సంబంధాన్ని తీసుకువస్తాగానీ మీరీ విషయం గురించి నాతో మాట్లాడినట్టు చీమక్కూడా తెలియకూడదు" అన్నాడు పైకి.

"నీమీదొట్టు! ఎవరికీ చెప్పను. నీకు నేతిగారెల మీద బెంగైతే, నాకు నిత్యభోజనం గురించి బెంగ. మనవడింటివాడైతే అదే చాలు" అంటూ సీతారావమ్మ కదిలి వెళ్లింది.

ఈసంబంధం కుదిరితే ఇంటికి పట్టిన చీడ వదలుతుంది అనుకుంటా.

మనసు మహా చెడ్డగా ఆలోచిస్తుంది ప్రాణం విసిగెత్తినప్పుడు.

★ ★ ★

మర్నాడు ఉదయం వేణుగోపాలస్వామి ఆలయంలో పెద వీర్రాజు గారి పేరిట విష్ణు సహస్రనామాలు చదివి ఆయనగారు అసెంబ్లీ ఎన్నికలకి వేసే నామినేషన్ పత్రాలకి పసుబ్బొట్లు పెట్టి వాటినీ, ఆయన్నీ అక్షతలు వేసి దీవించి పంపిన తర్వాత మండపంలో కూర్చుని ఎండిన గొంతుని కొబ్బరినీళ్లతో తడుపుకుంటున్న సమయంలో సీతారావమ్మ కోడలు సుభద్రమ్మ సిద్ధాంతిని పలకరించింది.

"దర్శనాలు లేవు. మొన్న వైకుంఠ ఏకాదశికి పూజ చేయిద్దామని కబురంపితే ఊరెళ్లారన్నారు"

"సిద్ధారెడ్డి మంత్రిగారు జిగురుపాడు ప్రాథమిక పాఠశాలలో మంచినీళ్ళ సదుపాయం కోసం సింటెక్స్ టాంక్ ప్రారంభోత్సవం చేస్తే మంత్రం చెప్పడానికి వెళ్లాను" అన్నాడు సిద్ధాంతి.

"నాకు తెలీకడుగుతానూ ప్రారంభోత్సవాలకి మంత్రాలేముంటాయని?"

"విఘ్నేశ్వర స్తుతి అన్ని సందర్భాలకీ ఆరంభ మంత్రం. ఆ తర్వాత సందర్భాన్ని పట్టి చదవడానికి ఏదో మంత్రం. సిద్ధారెడ్డి గారి గోత్ర నామాలు చెప్పి గంగపూజ చేయించాను" అన్నాడు సిద్ధాంతి నవ్వుతూ.

"ఇదివరలో బావులూ, చెరువులూ తవ్వించేటప్పుడు గంగపూజ చేయించేవారు. ఇప్పుడు ప్లాస్టిక్ డబ్బాలని సిమెంట్ దిబ్బల మీద నిలబెట్టి గంగపూజ చేయిస్తున్నారన్నమాట? పోనీలెండి, పిల్లలకి స్కూల్లో దాహం తీరే సదుపాయం కలిగించారు" అంది సుభద్రమ్మ.

"సదుపాయమా పాడా? గ్రామాలకి త్రాగునీను సరఫరా చెయ్యడానికి కొన్న నీళ్ల ట్యాంకర్‌కి ప్రారంభోత్సవం చెయ్యాల్సిన త్రాగునీటి శాఖా మంత్రి గంగరాజు గారికి పుష్య, మాఘమాసాల్లో ఉత్తరదిక్కుగా ప్రయాణం చేస్తే ప్రాణగండం ఉందట.

అందుకని హైద్రాబాద్‌లో ఉన్న పండితుడెవరో చైత్రమాసంలో ఉగాదినాడు ప్రారంభోత్సవానికి ముహూర్తం పెట్టారు. ఈలోపుగా మళ్లీ ఎలక్షన్లంటున్నారు. ఆ నీళ్లట్యాంకర్‌కి ప్రారంభోత్సవం చెయ్యాలని ఎవరి నుదుట రాసుందో?"

"సరే ఈ మాటలకేం గానీ మా ఆఖరివాడికి మంచి సంబంధం ఏదైనా ఉంటే చూడండి. ఆలస్యం జరిగిన కొద్దీ ఈకాలంలో ఆడపిల్లలకే కాదు మగపిల్లలకి కూడా పెళ్ళిళ్ళు జరగడం కష్టమైపోతోంది" అంది సుభద్రమ్మ మాటమార్చి.

"మీరన్నమాట నిజమే. నా ఎరికలో ఓ సంబంధం ఉంది. తరుగుతిమ్మరాజుగారి నాలుగో మనవరాలు.

మీ అబ్బాయికి ఈడూజోడూగా ఉంటుంది. అయినా కావాలనే ఈ సంబంధం విషయమై మీకు చెప్పలేదు"

"అంటే అమ్మాయి నైజం?"

"ఆఁహ అటువంటిదేమీ కాదు. నిప్పులాంటి పిల్ల. కానైతే పిల్లది మూలానక్షత్రం"

"ఇంట్లో అడుగుపెట్టే కొత్త కోడళ్ల జన్మనక్షత్రాలకీ, మూలనున్న ముసలమ్మల ఆయుర్దాయానికీ ముడిపెట్టడం ఇంగితజ్ఞానం లేని వారు చేసే పని. మనిషన్నతర్వాత మరణం తప్పుతుందా ఏమిటి? నాకటువంటి చాదస్తాలు లేవు. కుర్రాడికి నచ్చితే చాలు. వాళ్లని కదిపి చూడండి" అంది సుభద్రమ్మ. ఆమె మనసు మరోలా ఆలోచిస్తోంది.

"అదికాదు మీ అత్తగారికి తెలిస్తే..?" సిద్ధాంతి నసుగుతూ ఆగాడు.

"చూడండి సిద్ధాంతిగారూ. ఆవిడ మంచమెక్కినదీ కాదు, మూలనున్నదీ కాదు. శుభ్రంగా తిని తిరుగుతోంది. మీకు మరీ అంత ఇదిగా ఉంటే వాళ్లని నక్షత్రం మార్చి చెప్పమనండి"

"సరే వారిని కదిపి చూస్తాను. కానీ ఈ విషయమై ఎవరితోనూ అనకండి. మీ అత్తగారికి తెలిస్తే కార్తీకమాసంలో ఆవిడ చేయదల్చుకున్న లక్షపత్రి పూజకి మరొకర్ని నియమించుకుంటారు" అన్నాడు సిద్ధాంతి కాస్త ఆందోళన వెలిబుచ్చుతూ.

సుభద్రమ్మ చిరునవ్వు నవ్వుకుంటూ వెళ్ళిపోయింది.

ఓ ఆదివారం ఉదయం లోపలనున్న మూడు తిరుగుడు కుర్చీలూ ఖాళీలేక 'చెచెమెను' సెలూన్ బయట బెంచీమీద కూర్చున్నారు సిద్ధాంతీ, మెరుగు మాధవరావూ.

"ఇంటింటికీ వెళ్లి క్షవరాలు చేసే నారాయుడు ఈ క్షౌరశాల ప్రారంభించి భలే పేరు పెట్టాడు. చైనా



వాళ్ళ పేరు నారాయుడికెలా తట్టిందో?'' అన్నాడు మాధవరావు సిద్ధాంతితో.

"అహంభావానికి ఆలయమైన తలని దేవుడి ముందు వంచి తలనీలాలు అర్పించుకోవడం ఆచారమే అయినా క్షౌరశాలకి సాధారణంగా దైవాల పేర్లుంచరు.

నారాయుడు మంచి పేరేదైనా సూచించమని అడిగినప్పుడు అక్షర సంఖ్యా శాస్త్ర ప్రకారం నేనే ఈ పేరు పెట్టమన్నాను. ఇప్పుడితగాడి వ్యాపారం మూడు మూళ్ళు తొమ్మిది గడ్డాలుగానూ, ఆరు మూళ్ళు పద్దెనిమిది క్షౌరాలుగానూ ఉంది!'' అన్నాడు సిద్ధాంతి గొప్పగా.

"అసలింతకీ ఈ 'చెచెమెను' అంటే అర్థం ఏమిటి?'' మాధవరావు కుతూహలంగా ప్రశ్నించాడు.

"అందరికీ చైనా పేరని చెబుతున్నాడు. నేను మీకు చెబ్తా గానీ నారాయుడికి తెలిస్తే గొడవ చేస్తాడు.

అందుకని గోప్యంగా ఉంచండి. 'చెచెమెను' అంటే చెవినుంచి చెవిదాకా, మెడనుంచి నుదుటిదాకా క్షవర కల్యాణమన్నమాట'' అన్నాడు సిద్ధాంతి లోగొంతుకతో.

"సిద్ధాంతిగారూ కల్యాణమంటే గుర్తొచ్చింది. మా ఆఖరి కుర్రాడి పెళ్ళి విషయమై ఇంట్లో ఆడవాళ్ల నస ఎక్కువైపోయింది. ప్రాణాలు కొరుక్కు తినేస్తున్నారు. మంచి సంబంధం ఉంటే చెప్పండి'' అన్నాడు మాధవరావు.

"రెండు, మూడు సంబంధాలున్నాయి. కానైతే ఒకమ్మాయిది 'ఆశ్లేష', మరొక అమ్మాయిది 'మూల' నక్షత్రాలు. నేనే కావాలని ఇంతవరకూ చెప్పలేదు!''

"ఆశ్లేష నక్షత్రం ఆఖరిపాదం ఆఖరి క్షణంలో శిరోదయమై, మూలానక్షత్రం మొదటిపాదం మొదటి క్షణంలో పాదాలు బయటపడ్డ పిల్ల ఎవ్వరైనా ఉంటే చెప్పండి ఇద్దరిపీడా వదుల్తుంది?'' అన్నాడు మాధవరావు.

"మీ అమ్మగారికీ, మీ శ్రీమతికీ నిత్య ఘర్షణ జరుగుతోందని మీ మాటలు చెప్పకనే చెబుతున్నాయి. ఆశ్లేషకీ, మూలకీ మధ్యన తొమ్మిది నక్షత్రాలున్నాయి. నవమాసాలు మోయడం సహజం. అంతకంటే ఎక్కువ మోయడం అసాధారణంకాదు.క ఆనీ 'నక్షత్రానికో రోజు' అని బండలెక్క వేసుకున్నా తొమ్మిదిరోజుల పురుడు పురాణేతిహాసాలలో కూడా నాకు తెలుసున్నంతవరకూ లేదు.

కత్తెర పురుళ్ళు సామాన్యమైపోయిన ఈ రోజుల్లో 'మాడు నుంచి కాలు దాకా' ఆపరేషన్ థియేటర్ వెలుగు ఒకేసారి శిశువు మీద ప్రసరించడంతో జాతకశాస్త్రమే దెబ్బతినేసింది. మీ ఇంట పోరు మరీ అధికంగా ఉంటే ఆ ఇద్దరమ్మాయిల్నీ మీవాడికి కట్టబెట్టేయండి'' అన్నాడు సిద్ధాంతి నవ్వుతూ.

"నాకు తల్లీ, పెళ్లాల పోరు తప్పినా వాడికిద్దరి పెళ్లాల పోరు ప్రారంభమవుతుంది. జైలుశిక్ష పడుతుంది. ఉద్యోగం ఊడుతుంది. అయినా ఏదో మాట వరసకన్నాను కానీ అలా ఆలోచించడం పాపం. అత్తగారినీ, అత్తగారి అత్తగారినీ దారిలో పెట్టే చాకులాంటి పిల్లని చూడండి. నా ప్రాణం తెరిపిన పడుతుంది''

"వాళ్లిద్దర్నీ దగ్గరకు చేర్చగల ఉత్తమురాలైన పిల్ల నా ఎరికలో ఉంది. సుద్దుల సుబ్బారావు గాని ఒక్కగానొక్క కూతురు. బిఏ పాసై పై చదువులు చదివే తాహతు లేక ఏవో నాలుగు ప్రైవేట్లు చెప్పుకుంటోంది. ఎటొచ్చీ మీరు కట్నం గురించి ఆలోచిస్తే ఆ సంబంధం వైపు చూడ్డం అనవసరం'' అన్నాడు సిద్ధాంతి.

"ఆ పిల్ల ఉత్తమురాలని మీరెలా చెప్పగలరు? జాతకచక్రం గీశారా, హస్తరేఖలు చూశారా?''

"జ్యోతిషశాస్త్రం, హస్త సాముద్రికం అశాస్త్రీయమని ఘోష పెడుతున్న సమాజమే వేళ్ళూ, గోళ్ళూ, కళ్ళూ, చెవులూ, ముక్కుపుటాలూ వగైరాల ఆకారాన్ని బట్టి ఆఖరికి వ్యక్తి కాఫీ కప్పుని పట్టుకునే విధానాన్ని బట్టి కూడా మనస్తత్వం కనుక్కోవచ్చునన్న మనస్తత్వం నిపుణుల్ని సమర్థించడం జరుగుతోంది.

వివాహ ప్రయత్నాల్లో తప్పుడు నక్షత్రాలూ, జాతకాలూ ఇవ్వడం ఈరోజుల్లో పరిపాటి అయిపోయింది. దస్తూరీ, సంతకాలనేవి వ్యక్తుల సొంతం కాబట్టి ఈ ముగ్గురమ్మాయిల దస్తూరీని, సంతకాలనీ సేకరించి నిపుణులకి పంపండి.

గ్రాఫాలజీ అనే అధ్యయనం ద్వారా వారు అమ్మాయిల మనస్తత్వాన్ని గురించి తెలియజేస్తారు. ఆటు పై నిర్ణయం అబ్బాయికి వదిలేయండి. సుద్దుల సుబ్బారావు గారమ్మాయి ప్రైవేట్ పాఠాలు చెప్పే తీరు చూసి నాకా అభిప్రాయం కలిగింది. ఇంక నక్షత్ర దోషాలంటారా, ధర్మ సూక్ష్మాలనేకం ఉన్నాయి. నమ్మకం లేకపోతే ఏ గొడవా లేదు'' అన్నాడు సిద్ధాంతి కాస్త ఉక్రోషంగా, ఆవేశంగా.

"కట్నం ఆశతో 'మూడీ' అమ్మాయిల్ని కోడళ్ళుగా ఎంచుకుంటే మూడు తరాల కోడళ్లతో ఇల్లు అశాంతినిలయంగా మారిపోతుంది. ఎందుకంటే

## టీవీ తెచ్చే చేటు


ఇంట్లో పిల్లల గదిలో టీవీ ఉంటే వారు చదువులో వెనుకబడిపోతారు. దాదాపు నాలుగొందలమంది పిల్లల్ని స్టడీ చేశాక ఈ అంశాన్ని ప్రకటించారు. ప్రధానంగా లెక్కలు, భాషాపరమైన సామర్థ్యం, చూసి చదవడం వంటి విషయాలలో వీరిలో ప్రతిభ ఇతరులకంటే తక్కువగా ఉంటుందని తేల్చారు. ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే అదే పిల్లల గదిలో కంప్యూటర్ ఉన్నప్పుడు మేలైన ఫలితాలు సాధించగలరని చెప్పారు. పిల్లల గదుల్లో నుంచి టీవీ బయటకు తెచ్చి కొద్దిసేపు చూడనిస్తే పోయేదేమీ లేదంటూ ఉచిత సలహా కూడా పారేశారు.

-శ్రీసాయివల్లవి

## ఫ్లయింగ్ ఐస్‌క్రీమ్

బ్యాంకాక్ నగరానికి 80కిలోమీటర్ల దూరంలో ఉన్న నఖోన్ పట్టణం పేరు చెప్పగానే ఫ్లయింగ్ ఐస్‌క్రీమ్ గుర్తుకురావల్సిందే. ఇక్కడ ఆపిచార్ట్ అనే వ్యక్తి ఉదయాన్నే లేచి స్నానం చేసి నల్లటి సిల్క్‌సూట్ వేసుకుంటాడు. అతని సేల్స్ టెక్నిక్స్ కొంత విచిత్రంగానే ఉంటాయి. కుంగ్‌ఫ్యూ స్టైల్‌లో అతను ఐస్‌క్రీమ్స్‌ను అడిగినవారికి విసురుతాడు. వాటిని అందుకోవడానికి ఆర్డర్ ఇచ్చినవాళ్ళు పదే పదే ఆరాటపడే సన్నివేశం ఆసక్తిగా ఉంటుంది. వినోదానికి వినోదం. అతను దాదాపు పదహారేళ్ళుగా ఐస్‌క్రీమ్స్‌ను ఈ విధంగా అమ్మడం విశేషం.

-పి.వి.రమణకుమార్



మామూడో వాడిదీ ఊళ్ళోనే బదిలీల కవకాశంలేని ఉద్యోగం. ఇంకో సంగతి మా ఆవిడ తన ముద్దుల కొడుక్కి ఒక్క 'ల'కారం ఆశిస్తోంది. నా కూతుళ్ళిద్దరూ వాళ్ళమ్మలాగే రాకాసి మనుషులు. ఎంత చదువుకున్నా ఆడబుద్ధి పోని మనుషులు. లాంఛనాలు దండిగా లేకపోతే రంకెలు వేస్తారు.

అవి మరో యాభై వేలు. పిల్ల ఎంత సాధుస్వభావురాలైనా, కట్నం తెచ్చిన కోడలంటే అత్తకి కొంచెం బెదురుగానే ఉంటుంది. ఒకవేళ మా అబ్బాయికి సుబ్బారావు గారమ్మాయి నచ్చితే ఆ సొమ్ములో సాయికారిగా నేనే సర్ది అందరి ఎదుటా కట్నంగా ఇమ్మంటాను. మా వాళ్ళ దృష్టికే మూడు సంబంధాలు తీసుకురండి. నక్షత్రాల సంగతీ, దోష నివారణ మార్గాల గురించీ నిశ్చింతగా చెప్పండి. నిజానికి నాకూ, మావాడికీ అంత పెద్దగా నమ్మకాలు లేవు" అన్నాడు మాధవరావు.

"ధర్మదేవత కనీసం కుంటి నడకైనా నడుస్తోందీ అనుకుంటే అది మీలాంటి వారి మూలానే. కదిపి చూస్తాను" అన్నాడు సిద్ధాంతి.

సీతారావమ్మకి మనవడూ, సుభద్రమ్మా మాధవరావుల మూడో తనయుడు అయిన అభినవ్‌ని సిద్ధాంతి కలుసుకుని మూడు సంబంధాల్ని గురించీ చెప్పాడు కానీ వాళ్లింట్లో జరిగే మానసిక శీతలయుద్ధాన్ని గురించి చెప్పలేదు.

"నేను మాటవరసకి పెళ్ళికిప్పుడేం తొందరా అంటే వాళ్లా మాట నిజమే అనుకుని పెళ్ళి సంబంధాలు చూసే ప్రయత్నమే చెయ్యట్లేదు, గడ్డి పెట్టండి" అన్నాడు అభినవ్ తన మనసు సిద్ధాంతి ముందు విప్పుతూ.

ఓ మంచిరోజు చూసుకుని వాళ్లందరి ఎదుటా సిద్ధాంతి మూడు సంబంధాల విషయమూ చెప్పాడు. బొడ్డూడని పిల్లకాయలు ప్రేమ పిచ్చిలో పడి అదే జీవితమనుకుంటూ పారిపోయి పెళ్లిళ్ళు చేసుకునే సినిమాలు చూస్తూ కూడా యవ్వనంలోకి, ఉద్యోగంలోకీ ఎప్పుడో అడుగుపెట్టిన అభినవ్ ఎందుకు వివాహమంటే విముఖంగా ఉంటున్నాడో తనకర్థంకావడం లేదని చిన్నగా చీవాట్లు వేసి అతనెందుకు గృహస్థ ధర్మాన్ని స్వీకరించాలో అరడజను సంస్కృతశ్లోకాలు చదివి వివరించి ఒప్పించాడు. అభినవ్ కూడా అద్భుతంగా అభినయించాడు.

మూడు సంబంధాల్నీ చూడడం ఎవర్నీ నక్షత్ర, జాతకాలడగకుండా లౌక్యంగా ముగ్గురమ్మాయిల దస్తూరీలూ, సంతకాలూ సేకరించడం జరిగింది.

మాధవరావు వాటిని ఓ అధ్యయన నిపుణుడి వద్దకు సొమ్ముతో సహా పంపాడు.

అనతికాలంలోనే సమాధానం వచ్చింది. ఆశ్లేష అమ్మాయి చలాకీతనం, అస్థిరమైన ఆలోచనలు. మూల అమ్మాయి మంచి మనసు, రహస్యాల్ని దాచలేదు, కించిత్ కోపం. సుబ్బారావు కూతురు మితభాషిణి అయితే సుభాషిణి. గుట్టు ఎక్కువ, కార్యశూరిణి.

సిద్ధాంతి చెప్పింది నిజమేననిపించింది మాధవరావుకి, అభినవ్‌కి కూడా. సంబంధం ఖాయమైంది.

అనుకున్నట్టుగానే సుభద్రమ్మ ఇచ్చిపుచ్చుకోవడాల గురించి ప్రస్తావించడం, సుద్దుల సుబ్బారావు బ్రతిమిలాడి బేరాలాడి అన్నీ కలిపి ఒకటిన్నరకి ఒప్పించడం జరిగింది.

పెళ్ళి రెండురోజులుండనగా మాధవరావు లోపాయికారీగా సుద్దుల సుబ్బారావుకి సొమ్మందజేశాడు.

పెళ్లిరోజున తరలివెళ్ళేసరికి కల్యాణమండపం వెలవెలబోతూ కనబడింది. సుబ్బారావు ఇల్లు ఖాళీ చేసి వెళ్ళిపోయాడని తెలిసింది. ఆ తర్వాత సుబ్బారావు కుటుంబంతో సహా హైదరాబాద్ మకాం ఎత్తేసాడనీ, సుబ్బారావు కూతురు సినిమాల్లో ఛాన్సు కోసం తలమునకలుగా ప్రయత్నిస్తోందని తెలిసింది.

పోలీసులకి కంప్లైంట్ చేస్తే గుట్టురట్టయి ఇంటా బయటా అభాసుపాలు కావడం తప్ప మరేమీ ఉండదని మాధవరావు గప్‌చుప్‌గా ఉండిపోయాడు. సిద్ధాంతిని తప్పు పట్టబోతే "హస్తాక్షరశాస్త్రం మనస్తత్వం గురించి చెబుతుందేమో గానీ భవిష్యత్తుని గురించి చెప్పదు.

మనం సుబ్బారావు సంతకాన్ని కూడా తీసుకుని పంపితే బాగుండిపోయేది. కనీసం అతని దగుల్బాజీ మనస్తత్వం తెలిసుండేది!" అన్నాడు సిద్ధాంతి లౌక్యంగా.

చేసేదిలేక మాధవరావు తన సంతకాన్ని విశ్లేషణకు పంపుకున్నాడు. సమాధానం త్వరగానే వచ్చింది. 'మూర్తీభవించిన మంచితనం, ఇంగితజ్ఞానం లేని తెలివితక్కువతనం'.

గోతిలో పడిన తర్వాత కానీ నుదుటిరాత తెలియదు. బ్రహ్మరాతలకీ, మనిషి చేతలకీ మధ్య కార్యకారణ సంబంధం వెతికితే అదొక వలయమే.

☆



## టైం బాగోలేదు!

అతి చిన్న వయసులోనే హీరోగా సంచలనం సృష్టించాడు జూనియర్ ఎన్టీఆర్. 'సింహాద్రి'తో కలెక్షన్లలో రికార్డులు సాధించిన ఎన్టీఆర్‌కి ఆ తర్వాత నుంచి విజయం ఊరిస్తూనే వుంది. ఆంధ్రావాలా, నా అల్లుడు, నరసింహుడు చిత్రాలు బాక్సాఫీసు వద్ద పల్టీ కొట్టడంతో నిరాశలో మునిగిపోవడం సహజమే! కానీ ఆ నిరాశలోపడి అతడు తన బాడీ గురించి మర్చిపోయినట్టున్నాడని, బాగా లావైపోయాడని టాలీవుడ్ సినీ జనాలు చెవులు కొరుక్కుంటున్నారు. మామూలుగానే ఎన్టీఆర్ లావుగా కనిపిస్తాడు. అందుకే ఇప్పుడు ఎన్టీఆర్ స్మార్ట్‌గా తయారవ్వడానికి ప్రయత్నిస్తున్నాడు.

